క్లుప్తంగా

ఘనంగా చింతామణి అమ్మవారి సంబరం



చింతామణి అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్య దైవం.. కవిటిలో వెలిసిన చింతామణి అమ్మవారికి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మంగళవారం పెద్ద సంఖ్యలో చల్లదనం ఉత్సవాలు, మొక్కుబడుల సంబరాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపమైన గజముద్దను మేళ తాళాలతో కాళిక వేషధారణలు.. యువత బాణాసంచా కాలుస్తూ అమ్మవారి ఊరేగింపు యాత్ర నిర్వహించారు. అనంతరం కవిటి శివార్లలోని చింతామణి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదనివేదన చేశారు .

ఆక్రమణలను అరికట్టండి వినతి



ఆర్ఐ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలోని సురంగి రాజావారి క్రీడా మైదానంలో జరుగుతున్న ఆక్రమణలను ఆరికట్టాలని స్థానిక సీనియర్ క్రీడాకారులు, విశ్రాంత ఉద్యోగులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, మండల రెవెన్యూ కార్యాలయం ఆర్ఐ శ్రావణ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ క్రీడాకారులు పాపారావు, డిల్లీ, బాలాజీ, రాణో, శ్రీను తదితరులు ఉన్నారు.

'బాటిళ్లలో పెట్రోల్ అమ్మకాలు వద్దు'

ఇచ్ఛాపురం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున బాటిళ్లు, క్యాన్లలో పెట్రోల్, డీజిల్ విక్రయాలు చేయవద్దని ఇచ్ఛాపురం పట్టణ ఎస్ఐ వి సత్యన్నారాయణ బంక్ యజమానులకు సూచించారు.. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఎవరూ తిరగరాదని, అక్రమంగా మద్యం నిల్వ, రవాణా వంటివి చేయరాదన్నారు. బాణసంచా నిల్వలు ఉంచరాదన్నారు. అనుమతులు లేకుండా ఊరేగింపులు, డీజేలు పెట్టరాదన్నారు.

అలరించిన సంగీత విభావరి



సంగీతస్వరఝరి నిర్వహిస్తున్న కళాకారులు

కవిటి: సీతారామ్యాగరాజ 63వ వార్షికోత్సవాలు, 47వ అన్నమాచార్య వార్షికోత్సవాలలో భాగంగా కవిటి పట్టాభిరామ కళాపీఠంలో మంగళవారం నిర్వహించిన సంగీత స్వరఝరి సంగీత ప్రియుల్ని ఆనందసాగరంలో ఓలలాడించింది. హైదరాబాద్‌కు చెందిన మల్లెల కాంతి స్వరూప్ గాత్రానికి వయోలిన్‌తో మహావాది వాసుశాస్త్రి, మృదంగంతో గుంటుకు వెంకటరావు, ఘటంతో హనుమంతరావు సహకార వాయిద్యాలు అందించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ కళావేదిక నిర్వాహకులు బెందాళం కామరాజు, బెందాళం నారాయణమూర్తి సోదరులు కళాకారుల్ని ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు.

ముగిసిన సింధుపోలమ్మ ఉత్సవాలు



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

కంచిలి: కేసరపడ గ్రామంలో తొమ్మిది రోజులుగా నిర్వహించిన గ్రామదేవత సింధుపోలమ్మ ఉత్సవ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజున కూడా అమ్మవారిని పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది.

అమ్మవార్లకు చల్లదనం



గ్రామదేవతకు పూజలు చేస్తున్న మహిళలు

కాశీబుగ్గ: మందస మండలం సందూరు గ్రామంలో మంగళవారం వారాల పండుగ నిర్వహించారు. గ్రామంలో ఉన్నటువంటి సవరతల్లి, జడ్డమ్మతల్లి, కాలికమ్మతో పాటు ఆరు అమ్మవార్లకు చల్లదనం కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో గ్రామదేవత ఉత్సవాలు జరిపి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతీ ఇంటినుంచి ముర్రాటలను తీసుకొని.. మేళతాళాలతో ఊరేగింపుగా మహిళలంతా వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

ఒంటికి వ్యాయామం మంచిదేగా..

- పలాస మున్సిపాలిటీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు
- ఆనందం వ్యక్తం చేస్తున్న పట్టణ వాసులు



కాశీబుగ్గలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

కాశీబుగ్గ: వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చుతున్నారు. వివిధ పద్ధతుల్లో వ్యాయామం చేస్తున్నారు. అయితే వ్యాయామం చేయడానికి ప్రైవేటు జిమ్‌లో చేరాలంటే అధిక మొత్తంలో నెలవారి నగదు చెల్లించాలి. అటువంటి ఇబ్బందులు లేకుండా చక్కనైన.. ఉచిత ఓపెన్ జిమ్‌లను కాశీబుగ్గ-పలాస మున్సిపాలిటీ అధికారులు ఏర్పాటు చేశారు. రూ.32 లక్షల వ్యయంతో రెండు ఓపెన్ (బహిరంగ) జిమ్‌లు ఏర్పాటు చేసి వినియోగంలోకి తేవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జంట పట్టణాలో ఏర్పాటు..

పూర్తిస్థాయి పర్యవేక్షణలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలకు బహిరంగ జిమ్ సేవలందిస్తున్నారు. కాశీబుగ్గ పట్టణ పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మంకినమ్మ) క్రీడా మైదానంలో మూడేళ్ల క్రితం జిమ్ ఏర్పాటు చేయగా, తాజాగా పలాస ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. అందరూ వ్యాయామం చేసుకునేందుకు వీలుగా 14 రకాల పరికరాలను అమర్చారు. ఓపెన్ జిమ్ కావడంతో వర్షం, ఎండకు పాడవ్వకుండా ప్రత్యేకమైన రంగులు వేశారు. యంత్రాలు బిగించేచోట నీరు నిల్వకాకుండా క్యాప్‌లు బిగించారు. గతంలో ఈ మైదానంలో కేవలం వాకింగ్ ట్రాక్ మాత్రమే అందుబాటులో ఉండేది. మిగిలిన ప్రాంతమంతా చెత్తా చెదారాలతో నిండి ఉండేది. కరోనా థర్డ్ వేవ్ నేపథ్యంలో ముమ్మరంగా డిమాండ్ సైతం జిమ్‌లకు పెరిగింది. ఆరోగ్యంపై అనేక మంది శ్రద్ధ చూపుతున్నారు. ప్రస్తుతం నడకకు సైతం ఈ మైదానంలో అనుమతి ఇవ్వడంతో వారికి ఈ జిమ్ ఉపయోగపడుతుంది. జిమ్ యంత్రాలు గతంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా మున్సిపాలిటీకి మంజూరయ్యాయి. ఇలా జంట పట్టణాలలో రెండు చోట్ల వీటిని ఏర్పాటు చేయడానికి రూ.32 లక్షలు అయ్యిందని అధికారులు తెలిపారు. జిమ్‌ల తయారు చేసినటువంటి మండపానికై న రూ.రెండు లక్షలను మున్సిపల్ సాధారణ నిధులను కేటాయించారు. అధికారులు తరచూ వచ్చి జిమ్‌లను పరిశీలిస్తున్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సిబ్బంది సరిచేస్తారని మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు.



పలాసలో ఓపెన జిమ్‌లో వివిధ పరికరాలు



వ్యాయామం చేస్తున్న యువకుడు

శాంతిభద్రతలకు విఘాతం లేకుండా చూడాలి

- ఇచ్ఛాపురం ఆర్వో సుదర్శన్‌దొర



అధికారులతో మాట్లాడుతున్న సుదర్శన్‌దొర

ఇచ్ఛాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల కోడ్ జూన్ ఐదో తేదీ వరకు ఉంటున్న నేపథ్యంలో శాంతిభద్రతలకు ముప్పు తెచ్చే కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా చూడాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి సుదర్శన్ దొర అదికారులకు సూచించారు. ఈ మేరకు ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గ్రామ రెవెన్యూ సహాయకులతో దండోరా వేయించి రెండు రోజులకోసారి దండోరా రిపోర్ట్‌ను ఆయా మండల తహసీల్దార్‌కు సమర్పించాలని ఆదేశించారు. గుమిగూడి ప్రజలు ఉండరాదని, సభలు, సమావేశాలు పెట్టరాదన్నారు. పండుగల్లో డీజేల ఏర్పాటు, వీధి నాటకాలు, స్టేజి ప్రోగ్రామ్స్ పెట్టరాదని, బాణసంచా పేల్చరాదని, పెట్రోల్, డీజిల్ నిల్వలు కంటైనర్‌లో గాని, బాటిల్స్‌గాని, ఎటువంటి డ్రమ్స్ ఇతర పాత్రల్లో ఉంచరాదని ఆదేశించారు. ఈ విషయాలను అతిక్రమించిన వారిపై పోలీస్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఎస్‌డీటీలు, ఆర్ఐలు, ఇచ్ఛాపురం, సోంపేట సీఐలు టి.ఇమ్మాన్యువల్ రాజు, హెచ్.మల్లేశ్వరరావు, ఎస్సైలు ఎం.లక్ష్మణరావు, సత్యనారాయణ, హైమావతి, రాజేష్, రాము ఉన్నారు.

జుంబా డాన్స్‌పై అవగాహన



జుంబా డాన్స్ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: మనిషికి చురుకైన ఫిట్‌నెస్ కోసం జుంబా డాన్స్ ఎంతో ఉపకరిస్తుందని వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నడక సంఘాల ఆధ్వర్యంలో జుంబా డాన్స్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నడక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. శరీరంలో రక్త ప్రసరణ సక్రమంగా జరగటానికి ఈ డాన్స్ ఎంతో మేలు చేస్తుందన్నారు. రక్తంలో ఆక్సిజన్ స్థాయిని మెరుగు పరచడానికి ఉపయోగపడే ఏకైక సాధనం జెంబా డాన్స్ అని ఆదిత్య వాకర్స్ క్లబ్ ప్రతినిధి హరికా అన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గేదెల ఇందిరా ప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ 102 సంస్థలు డిప్యూటీ గవర్నర్ శాసపు జోగినాయుడు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న ఔత్సాహికులు

శ్రీకాకుళం కల్చరల్: ఒక వ్యక్తి చేసే రక్తదానంతో ఇద్దరి ప్రాణాలను నిలబెట్టవచ్చని రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానంపై ఉన్న అపోహలను విడనాడాలన్నారు. రక్తదానం చేసిన 120 రోజులలో కొత్త రక్తం వస్తుందన్నారు. రక్తదానం చేయడం వలన అనేక వ్యాధులు నయమవుతాయని వివరించారు. ఏఓఎల్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, బి.వి.రవిశంకర్, వి.సుధారాణి, అందవరపు సునీల్ తదితరులు రక్తదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలోని రోగులకు సకాలంలో రక్తం అందించడానికి యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఆదర్శనీయులు సూర్యనారాయణ మాస్టార్



మాట్లాడుతున్న వక్తలు

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ వజ్రపుకొత్తూరు మాజీ ప్రధాన కార్యదర్శి తమ్మినాన సూర్యనారాయణ మాస్టార్ ఆదర్శనీయులని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. కాశీబుగ్గ రోటరీనగర్‌లో సూర్యనారాయణ సంతాపసభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువర్మ మాట్లాడుతూ సూర్యనారాయణ ఏపీటీఎఫ్‌కి చేసిన సేవలను గుర్తు చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి దవల సరస్వతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్వీ అనిల్‌కుమార్, జిల్లా సబ్ కమిటీ సభ్యులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్, బి.సుభాష్‌బాబు, పి.వి.రమణ, అధికసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కాశీబుగ్గ: రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న దృశ్యం

టెక్కలి: మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతిని టెక్కలిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనగా నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు డాక్టర్ కిల్లి కృపారాణి, డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, డాక్టర్ రామ్మోహన్‌రావు, టీబీజీ గుప్తా, పి.ఆనంద్, జి.కృష్ణ, పి.మాధవరావు, పి.రమేష్, హేమారావు, హరీష్, సతీష్, విశ్వనాథం పాల్గొన్నారు.

కాశీబుగ్గ: రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాశీబుగ్గ బస్టాండ్ వద్ద ఉన్న ఆయన శిలా విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తంగుడు వీర్రాజు, డాక్టర్ రమేష్‌సాహు, ఉప్పాడ రాజారావు, రత్నాల బాబూరావు పాల్గొన్నారు.

విత్తన అవసరాలు గుర్తించండి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

సోంపేట: సోంపేట వ్యవసాయ డివిజన్ పరిధిలోని రైతులకు అవసరమైన వరి, పచ్చిరొట్ట విత్తనాల అవసరాలు గుర్తించి వారికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ అన్నారు. సోంపేటలో నాలుగు మండలాల వ్యవసాయాధికారులు, సిబ్బంది, వ్యవసాయ సహాయకులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం రైతు నమోదు పురోగతిలో ఉన్న జీలుగ, జనుము విత్తనాల సరఫరా, అవసరాన్ని అడిగి తెలుసుకున్నారు. రాయితీ విత్తనాలపై రైతులందరికీ సమాచారం ఇవ్వాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ శాఖ ఎక్కువగా ప్రోత్సహిస్తున్న జీవన ఎరువులు, పురుగులు, తెగుళ్ల జీవనియంత్రణ మందులు, సమగ్ర పోషక యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ పి.బాలకృష్ణ మాట్లాడుతూ.. విత్తన సరఫరా విధివిధానాలు, సన్నాహాలపై సలహాలు సూచనలు ఇచ్చారు. రైతుస్థాయి విత్తన ఉత్పత్తిని, గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ద్వారా ప్రోత్సాహించాలన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు టి.భవానీశంకరరావు, మండల వ్యవసాయాధికారులు బి.నర్సింహామూర్తి, పి.భార్గవి, నాలుగు మండలాల వ్యవసాయ సహాయ సంచాలకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఇద్దివానిపాలెంలో వేతనదారుల మస్టరు పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి

కవిటి: వేతనదారులు ఉపాధి హామీ పథకం పనులు చేయడం ద్వారా పూర్తి వేతనం పొందాలని కవిటి ఎంపీడీవో కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్టరు, క్షేత్ర సహాయకుల పనితీరును తనిఖీ చేశారు. పథకం నిర్దేశించిన కొలతల మేరకు వేతనదారుడు పనులు నిర్వహిస్తే పూర్తిస్థాయి వేతనం పొందడం చాలా సులభమని అన్నారు. వేసవి నేపథ్యంలో ఉదయం తొమ్మిదిలోగా, మధ్యాహ్నం మూడు గంటల తరువాత పనులు చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ అందిస్తున్న ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లను పని ప్రదేశంలో ఉంచుకోవాలన్నారు. ఏపీవో కడియం భాస్కరరావు ఉన్నారు.

ఓట్ల లెక్కింపులో జాగ్రత్తలు వహించండి

- పలాస ఆర్వో భరత్ నాయక్



మాట్లాడుతున్న ఆర్వో భరత్‌నాయక్

కాశీబుగ్గ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు హాజరయ్యే అభ్యర్థులు, జనరల్ ఏజెంట్‌లు తగిన జాగ్రత్తలు వహించాలని పలాస ఎన్నికల అధికారి భరత్ నాయక్ అన్నారు. పలాస ఆర్వో కార్యాలయంలో అన్నిపార్టీల ప్రతినిధులు, జనరల్ ఏజెంట్లతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కౌంటింగ్‌లో సమయంలో తీసుకోవాలని జాగ్రత్తలను వివరించారు. వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు అల్లు రమణ, అనీల్ రాజ్, పోతనపల్లి అప్పలస్వామి, అఖిలేష్ యాదవ్, జయదేవ్, కర్రి వెంకటరమణ, పండా పాల్గొన్నారు.

జూన్ మొదటి వారం నుంచి వరి విత్తనాలు పంపిణీ



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ శ్రీధర్

కోటబొమ్మాళి: జిల్లాలో జూన్ మొదటి వారం నుంచి ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఖరీఫ్ సీజన్ కోసం రాయితీపై 28 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు, డిమాండ్‌కు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టామని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీధర్ తెలిపారు. కోటబొమ్మాళి మండలం వాంగ్రాడ సచివాలయంలో వ్యవసాయాధికారులు, రైతులతో విత్తనాల పంపిణీపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది లేకుండా సాంబ, స్వర్ణ, ఎంటీయూ 1061, 1224, 1121, ఆర్‌జీఎల్ 2537 రకాల వరి విత్తనాలను సిద్ధం చేసి శ్రీకాకుళం, నరసన్నపేట, కంచిలి గొడౌంలలో నిల్వ చేశామన్నారు. అన్ని ఆర్‌బీకేల్లో అగ్రికల్చరల్ అసిస్టెంట్ల ద్వారా విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని మండల వ్యవసాయాధికారులను ఆదేశించామన్నారు. జిల్లా విత్తనసంస్థ మేనేజర్ పి.బాలక్రిష్ణ, ఏడీ భవానీశంకర్, ఏవో ఎస్.గోవిందరావు, మండలంలోని 27 ఆర్‌బీకేల అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గొడవలు జరగకుండా సహకరించాలి



రావివలసలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టెక్కలి రూరల్: మరి కొద్దిరోజుల్లో ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా ప్రజలు సహకరించాలని టెక్కలి తహసీల్దార్ బాలమురళీకృష్ణ, టెక్కలి సీఐ హైదయ్య కోరారు. మండలంలోని రావివలస, బూరగాం, బొప్పాయిపురం, రామేశ్వరం గ్రామాల్లో మంగళవారం ప్రజలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాల్లో ఎటువంటి వివాదాలకు తావివ్వవద్దని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలకు పాల్పడవద్దన్నారు. వివాదాలకు చోటిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విజయోత్సవ వేడుకల్లో నిబంధనలు పాటించాలన్నారు. వివాదాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని.. ప్రజలు గుమిగూడి ఉండవద్దని విజ్ఞప్తి చేశారు. పెట్రోల్ బంకుల్లో లూజ్ పెట్రోల్ విక్రయాలు చేపట్టవద్దన్నారు. కాగా రావివలస గ్రామంలో 12 మంది, టెక్కలి కోదండరామవీధిలో ఆరుగురుపై బైండవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ హైదయ్య తెలిపారు. టెక్కలి ఎస్ఐ లక్ష్మి, ఎస్ఐ-2 వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ముగిసిన గ్రామ దేవత ఉత్సవాలు



గోపాల గోపాల నృత్య రూపకంలో కళాకారులు



ఒడిశా బాలికల గారడీ విద్య ప్రదర్శన



పురవీధుల్లో అసిరిపోలమ్మ ఊరేగింపు



కాంతార నృత్య ప్రదర్శన

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లండపుట్టుగ-కమలాయిపుట్టుగ గ్రామాల్లో కొద్దిరోజులుగా జరుగుతున్న అసిరిపోలమ్మ గ్రామ దేవత నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మేళతాళాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పుర వీధుల్లో ఊరేగించి గ్రామ పొలిమేరలో ఉన్న ఆలయంలో పునః ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వందలాది మంది ఉత్సవాలను తిలకించేందుకు తరలివచ్చారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com